క్లుప్తంగా

హరితహారానికి గుంతలు సిద్ధం చేసుకోవాలి

ఎంపీడీఓ సంధ్య



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వచ్చే హరితహార కార్యక్రమానికి గుంతలను సిద్ధం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. వచ్చే హరితహార కార్యక్రమంలో ప్రతి గ్రామంలో 3 వేల మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో సంధ్యారాణి, తారాబాయి, రంజిత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్లుకు ఆన్‌లైన్‌లో ఆధార్ నమోదు



ఆధార్ వివరాలు నమోదు చేస్తున్న ఆపరేటర్

మొయినాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విద్యుత్ జీరో బిల్లు కోసం ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు నమోదుకు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. తమ కరెంటు బిల్లు 200లోపు ఉందని జీరో బిల్లు రాలేదంటూ పేర్కొంటూ తమ కుటుంబానికి సంబంధించిన ఆధార్‌కార్డుతో ఆన్‌లైన్ చేయించుకున్నారు. ప్రజలు అధికంగా రావడంతో కార్యాలయ ఆవరణ సందడిగా మారింది.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కొత్తూరు: కోర్టు కేసు కారణంగా రంగారెడ్డి జిల్లాలో నిలిచిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని పీఆర్టీయూ సంఘం నేత విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఆయన గురువారం కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్, కల్వకుర్తి డివిజన్‌లోని పది మండలాలు రంగారెడ్డి జిల్లా పరిధిలోకి రావడంతో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దీంతో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన ఎమ్మెల్సీకి వివరించారు. వెంటనే కోర్టు కేసు రద్దు చేయడంతో పాటు ఇతర జిల్లాల మాదిరిగా రంగారెడ్డి జిల్లాలో కూడా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ సూచనల మేరకు పాఠశాలలో ఈకో క్లబ్ యాక్టివిటీ కమిటీని ఏర్పాటు చేశామని హెచ్‌ఎం జి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఈకో క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రతీ తరగతిలో తడి, పొడి చెత్త వేరుగా చేసి కంపోస్టు గుంతల్లో వేయాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం వ్యర్థాలను సేకరించే వారి వద్దకు విద్యార్థులను తీసుకెళ్లి తడి, పొడి చెత్తను ఎలా తొలగిస్తున్నారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాతబడిన దుస్తులు, బొమ్మలు, ఇతర వస్తువులు ప్రజల నుంచి సేకరించి అవసరమైన వారికి ఇవ్వడంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోచయ్య, కమలమోహన్, బందయ్య, పవన్‌కుమార్, సుదర్శన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం చేవేళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని అన్ని విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 వయస్సు గల పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను ఆయా శాఖల సిబ్బంది పంపిణీ చేశారు. నులిపురుగులను నులిమేస్తేనే పిల్లలు ఆరోగ్యవంతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. పిల్లల్లో ఆకలి మందగించడం, రక్తహీనత వంటి పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు.



శంకర్‌పల్లి: ఆదర్శ పాఠశాలలో మాత్రలు వేస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్



కేశంపేట: విద్యార్థికి మాత్రలు వేస్తున్న స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి

చేవెళ్ల: పిల్లలకు వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించాలని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. గురువారం చేవెళ్లలోని అంగన్‌వాడీ, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆమె అల్బెండోజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. కడుపులో నులిపురుగుల ఉండడంతో రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపులో నొప్పి రావడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని, వీటిని గుర్తించి ప్రాథమికంగా చికిత్స అందించాలన్నారు. 1–19లోపు పిల్లలకు ప్రభుత్వం మాత్రలను అందిస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేదశ్రీ, వైభవ్‌రెడ్డి, సీడీపీఓ శోభారాణి, హెచ్‌ఎం ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: నులిపురుగులపై పాఠశాల దశలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. 1వ వార్డులో సంతోష్, 7వ వార్డులో అశోక్ తమ వార్డుల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: విద్యార్థికి మాత్ర వేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి



మొయినాబాద్: చిలుకూరు గురుకులంలో మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ శ్రీకాంత్

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు అల్బెండోజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, సీడీపీఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి, నాయకులు యాదయ్యయాదవ్, బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నందిగామ: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ ప్రియాంక

శ్రద్ధగా చదువుకోవాలి..

నందిగామ: విద్యార్థులు చిన్నప్పటినుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని, ఇష్టంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపీపీ ప్రియాంక సూచించారు. మండల కేంద్రమైన నందిగామలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తుందని, ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమారస్వామిగౌడ్, కొమ్ము కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం



కొత్తూరు: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూరు: ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నులిపురుగుల బారిన పడితే విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతారన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో సరైన ఎదుగుదల ఉండదని, మలబద్ధకంతో పాటు ఇతర అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, నాయకులు దేవేందర్‌యాదవ్, శ్రీనివాస్, యాదయ్య, శివా చారి, రవీందర్, మాదారం నర్సింలుగౌడ్, సోమ్లానాయక్, వెంకటేశ్, పాఠశాల హెచ్‌ఎం అంగోర్‌నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పెంజర్లలో..

మండలంలోని పెంజర్ల గ్రామంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, బాల్‌రాజు, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆచార్య జయశంకర్ విగ్రహావిష్కరణ

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జాతిపిత, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నేడు(శుక్రవారం) నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రఘవాచారి, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మేధావులు, విద్యావంతులు, తెలంగాణ వాదులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డంప్‌యార్డు నిర్మించొద్దు

ఎంపీడీఓ కార్యాలయం ఎదుట స్థానికుల బైఠాయింపు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: తమ గ్రామంలో చేపడుతున్న డంప్‌యార్డు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బయన్నగూడ గ్రామస్తులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం అధికారుల తీరును నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ పక్క గ్రామమైన మహాలింగపురం గ్రామంలోని చెత్తను తమ గ్రామంలో వేయడం ఏమిటని, దీంతో పెద్దఎత్తున దుర్వాసన వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గ్రామ దేవుడైన బయన్నస్వామి దేవాలయం కొత్తగా నిర్మిస్తున్న డంప్‌యార్డుకు సమీపంలోనే ఉందని, దీంతో భక్తులు ఇబ్బంది పడుతారన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించుకోవాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఎంపీఓ గీత వచ్చి వారిని శాంతింపజేశారు. నిర్మాణ పనులను నిలిపివేయాలని గ్రామ కార్యదర్శికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు నిరసనను విరమించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు పనులు చేపట్టొద్దని ఆమె సూచించారు. నిరసనలో నర్సింహారెడ్డి, కాంతిరెడ్డి, మాణిక్‌రెడ్డి, బుచ్చయ్య, విఠలయ్య, రాములు, మల్లేశం తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



నోడల్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సీఐటీయూ జిల్లా నాయకురాలు స్వప్న

కడ్తాల్: మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు స్వప్న డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించి నోడల్ అధికారి జంగయ్యకు గురువారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు లక్ష్మమ్మ, వరలక్ష్మి, బుజ్జమ్మ, బాలమణి, లలిత, సనా తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కడ్తాల్: మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నూతన మండల కార్యవర్గాన్ని సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షురాలిగా లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మి, సభ్యులుగా బుజ్జమ్మ, సనా, అలివేలు, భాగ్యమ్మ, బాలమణి, లలితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ



మాట్లాడుతున్న అధికారులు

తుర్కయంజాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆదేశించారు. గురవారం ఆమె అధ్యక్షతన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధికి సంబంధించి 24 అంశాలపై కౌన్సిల్‌లో చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బి.చంద్రశేఖర్, వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు రశీదు ఇవ్వాలి

మండల వ్యవసాయ అధికారి శ్రీలత

కడ్తాల్: రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాపుల వద్ద ధరల పట్టిక, ఎరువుల నిల్వలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అభినవ్, డీలర్లు తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీలత

తవ్వారు.. మరిచారు..

ఎన్కెపల్లి పాఠశాల ఎదుట ప్రమాదకరంగా పైపులైన్ గుంత

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మంచినీటి గేట్‌వాల్ వద్ద లీకేజీ మరమ్మతుల కోసం గుంతను తవ్వి పూడ్చకపోవడంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారింది. గ్రామంలో మంచినీటి పైపులైన్‌కు సంబంధించిన గేట్‌వాల్ వద్ద లీకేజీ ఉండడంతో పదిరోజుల క్రితం దానిని తవ్వి మరమ్మతులు నిర్వహించారని, కానీ గుంత పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ గుంత పక్కనే కొంత దూరంలో మరొక గేట్‌వాల్ వద్ద లీకేజీ అవుతుండడంతో ఆ పైపులైన్‌లో మురుగునీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గుంత అంగన్‌వాడీ పిల్లలు, ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన బాత్‌రూమ్‌ల వద్దనే ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గుంతను పూడ్చాలని, మరొక గేట్‌వాల్ వద్ద లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బాత్‌రూమ్‌ల వద్ద తవ్వి వదిలేసిన గుంత



గేట్‌వాల్ వద్ద లీకేజీతో పైపులోకి వెళ్తున్న మురుగునీరు

నక్షబాట కబ్జాకు గురికాకుండా చూడాలి

తహసీల్దార్‌కు చందనవెల్లి గ్రామస్తుల వినతి

షాబాద్: నక్షబాటను కబ్జా చేసిన పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చందనవెల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చందనవెల్లి నుంచి అంతిరెడ్డిగూడ, చందనవెల్లి పెద్ద చెరువు వరకు నక్షబాటను పరిశ్రమల యాజమాన్యం కబ్జాకు గురికాకుండా చూడాలని, కబ్జా చేసిన పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చందనవెల్లి నుంచి అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి వరకు నాలుగు శతాబ్దాలుగా నక్షబాట ఉందని, టీఎస్ఐఐసీ కంపెనీ వారు రోడ్డును మూసివేసి కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజుల క్రితం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చామని ఇప్పటివరకు స్పందించలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నక్షబాట కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ ఎండీ అన్వర్ మాట్లాడుతూ.. టీఎస్ఐఐసీ అధికారులతో మాట్లాడి చందనవెల్లి, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి గ్రామస్తులకు తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చేవెళ్ల స్వామి, నీరటి ఆంజనేయులు, వేమారెడ్డి, నర్సింహారావు, యాదయ్య, అనంతం, శోభ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ ఎండీ అన్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం

మొయినాబాద్‌రూరల్: చిన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించి వారి భవిష్యత్ మొదటి మెట్టు కోసం కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్ల మండల కార్యదర్శి కవిత, లక్ష్మిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల రెండో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ కవిత నిర్వహించారు. కవిత, లక్ష్మిలు కలిసి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించి వారి భవిష్యత్ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయాలు రజనీ, ఆశకార్యకర్తలు లక్ష్మి, శివరాణి, సుస్థిర, పిల్లు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్ కవిత, లక్ష్మి తదితరులు